ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

విజయనగరం

రాష్ట్ర మహిళా బాక్సింగ్ పోటీలకు

7న జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11, 12, తేదీలలో జరగబోవు రాష్ట్ర మహిళా బాక్సింగ్ పోటీలకు విజయనగరం జిల్లా సీనియర్ బాక్సింగ్ గర్ల్స్ జిల్లా జట్టు ఎంపిక స్థానిక రాజీవ్ స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు ఎంపిక జరుగుతుందనిబాక్సింగ్ అసిషియేషన్ కార్యదర్శి ఐ.అశోక్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వెయిట్ కేటగిరిస్ : 45-48, 48-51, 51-54, 54-57, 57-60,60-65, 5-70, 70-76, 75-80, 80 ఉన్నవారు పాల్గినవచ్చును తెలిపారు. 1-1-1984 నుండి 31-12- 2005 లోపు పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఫిట్నెస్ సర్టిఫికేటు తీసుకురావాలని తెలిపారు.

● విశాఖలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
● ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి కదిలొచ్చిన ఉపాధ్యాయులు
● గెలుపుతో ఉత్తరాంధ్రలో చరిత్ర లిఖించాలని వక్తలు పిలుపు

ఉత్సాహంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

విజయగౌరి నామినేషన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి విజయగౌరి విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్‌కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంభిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో 50వేల మంది టీచర్లు పోరాడినప్పుడు ఎంఎల్‌సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు.

సభనుద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమాలు చేపట్టకపోతే ప్రభుత్వ విధానాల్లో మార్పు రాదని, ఉపాధ్యాయులకు కష్టాలొచ్చినప్పుడు కనపడని వారు నేడు పోటీకి సై అంటున్నారని అన్నారు. అటువంటివారిని విద్యావంతులైన టీచర్లు ఓడించాలన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాత్రమే అమలు చేస్తోందని, పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తేనే దీన్ని అడ్డుకోవడం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి యుఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్రనాయకులు ఎస్ఎస్.నాగమణి, టిఆర్.అంబేద్కర్, చినబ్బాయ్, విజయనగరం, మన్యం జిల్లాల నుంచి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, కోశాధికారి రెడ్డి మోహనరావు, నాయకులు డి.రాము, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, రమేష్‌చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే అజెండా : విజయగౌరి

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. విద్యా రంగంలో జిఒ 117ను సంపూర్ణంగా రద్దు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానన్నారు. పాఠశాలల మూత ఆపాలని, సిపిఎస్ రద్దు చేయాలని గొంతెత్తుతానన్నారు. యాప్‌ల భారం ఉపాధ్యాయులకు ఉండకుండా చేస్తానన్నారు. విద్యారంగాన్ని రక్షించే పోరాటాలు సాగిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలిచేలా అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌కు నామపత్రాలు దాఖలు చేశారు.

ర్యాలీలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు

టైమ్‌స్కేల్ అమలుచేయాలి

ఎపి ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ టీచర్స్, వర్కర్స్ జెఎసి చైర్మన్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తవలస

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్ అమలు చేయాలని ఎపి ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ టీచర్స్, వర్కర్స్ జెఎసి చైర్మన్ నాగేశ్వరరావు.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తవలస పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరందరినీ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. బొబ్బిలిలో జరిగిన ఎన్నికల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు కాదని విడుదల చేసిన జిఒను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీలను అమలు చేయకుంటే,



మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ నాగేశ్వరరావు

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. విజయగౌరి గెలిస్తేనే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు బాగుంటాయని చెప్పారు. వారి సమస్యలపై విజయగౌరికి అవగాహన ఉందని, చట్టసభల్లో గళం వినిపించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గాడు అప్పారావు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి-లక్ష్మవరపుకోట

ఆశా కార్యకర్తపై మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ సంఘటన గురువారం మండలంలోని రేగ పంచాయతీ పరిధిలోని నీలకంఠపురంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం...

నీలకంఠపురం గ్రామస్తుల ఆరోగ్య సమాచారం సేకరించేందుకు ఆశా కార్యకర్త గొల్ల శైలజ ఆ గ్రామంలో గురువారం పర్యటిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఎర్ర అప్పారావు మద్యం మత్తులో ఆమెపై దాడి చేశాడు. కులం పేరుతో ఆమెను దూషించి, నానా దుర్భాషలాడాడు. శైలజ చేతిలో ఉన్న రికార్డులను అప్పారావు లాక్కొని వెళ్లిపోయాడు. దాడి ఘటనపై వెంటనే బాధితురాలు.. వైద్యాధికారి అజయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆశా కార్యకర్త శైలజ, ఆమె భర్త రవి తెలిపారు. గతంలో ఎఎన్ఎంపై అదే వ్యక్తి దాడికి పాల్పడటంతో కేసు కూడా నమోదైందని చెప్పారు.

ఆశాలకు రక్షణ కరువు

ఆశాలు, ఎఎన్ఎంలకు రక్షణ లేకుండా పోయిందని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు గొల్ల దేవి ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ ఆశాలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. దాడుల నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న జాతీయ నులిపురుగుల దినోత్సవం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో గుర్ల మండలంలో తప్ప జిల్లా అంతటా ఈనెల 10న డీ వార్మింగ్ డే సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు సరఫరా చేస్తామని, మధ్యాహ్న భోజన అనంతరం అరగంట తర్వాత 19 ఏళ్ళ లోపల ఉన్న వారంతా ఈ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. గుర్ల మండలంలో బోదకాలుకు సంబంధించిన మాత్రలు వేస్తున్నందున నులిపురుగుల నివారణా మాత్రలు ప్రస్తుతం వేయడం లేదని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులతో కన్వర్జన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3 లక్షల 60 వేల మందికి ఈ నెల 10న అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలు, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులందరికీ , బడి బయట ఉన్న 19 ఏళ్ళ లోపు వారికి తప్పక మాత్రలు వేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా

మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

గ్రామాల్లో అవగాహన కలిగించాలని, వైద్య శాఖ ద్వారా వైద్య సిబ్బందికి, ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు, ఆయాలకు మాత్రలు ఏ విధంగా వేయాలో అవగాహన కలిగించాలన్నారు. ఎంపిడిఒ , మండల ప్రత్యేకాధికారులు కూడా ఈ కార్యక్రమం లో పాల్గొని పర్యవేక్షించాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం 1 గంట లోపలే భోజనం పూర్తి చేసి, 1.30 నుండి 2.30 గంటల మధ్య మాత్రలు మింగించాలని, మధ్యాహ్నం 4 గంటల వరకు పరిశీలన లో ఉంచాలని , ఎటువంటి రియాక్షన్ వచ్చినా సమీప పి.హెచ్.సి లకు తీసుకు వెళ్ళాలని, అందుకోసం 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మాత్రలు తీసుకొని వారికి 17 వ తేదీన మాప్ అప్ డే గా భావించి ఆ రోజున మాత్రలు వేయాలని తెలిపారు.

జిల్లాలో డయేరియా లేదు

జిల్లాలో ఎక్కడా ప్రస్తుతం డయేరియా లేదని, ప్రజలు భయాందోళనలు చెందనవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేసారు. డయేరియాపై వార్తా పత్రికల్లో వచ్చేవి అవాస్తవాలని, ప్రజలు వాటిని నమ్మవద్దని తెలిపారు. ఎక్కడైనా విరేచనాలు, వాంతులు సంభవించినా అవి సాధారణంగా వచ్చినవేనని, డయేరియా వలన కాదని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ జీవన రాణి, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిపిఒ వెంకటేశ్వర రావు, సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా పిఒ డాక్టర్ ఎ.రామారావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలప అక్రమార్కులపై

చర్యలకు వెనుకడుగు

● దాటవేత ధోరణిలో పోలీస్, అటవీశాఖ అధికారులు
● కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-వేపాడ

వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలో ఉన్నా అన్నీ సమకూరుతాయన్న చందంగా తయారైంది.. వేపాడ మండలంలోని కలప అక్రమార్కుల తీరు. దళితుల భూముల్లో కలపను అక్రమంగా నరికి తరలించుకు పోయినా, ఈ విషయమై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు నాన్చుడు ధోరణి ప్రదర్శించడమే అందుకు కారణం. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో పోలీస్, అటవీ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు శాఖల అధికారులు లాలూచీ పడ్డారన్న ఆరోపణలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

మండలంలోని చామలాపల్లి గ్రామ దళితులకు గతంలో భూమి అభివృద్ధి పథకం నిమిత్తం 24 ఎకరాలను పంపిణీ చేశారు. ఈ భూముల్లో 46 భారీ టేకు చెట్లను అనుమతులు లేకుండా మూడు నెలల క్రితం అక్రమార్కులు నరికి, తరలించుకు పోయారు. ఈ విషయమై తహశీల్దార్ జె.రాములమ్మ దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా టేకు చెట్లు నరికేసినట్లు గుర్తించి, జిల్లా అధికారులకు నివేదికలు కూడా పంపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పంచనామా నిర్వహించి వివరాలను పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని స్థానిక అటవీ అధికారులను వారు ఆదేశించారు. నెలలు కావస్తున్నా అటవీశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది చర్యలు మాత్రం తీసుకోలేదు. దీంతో ఆ శాఖల అధికారుల పనితీరు పట్ల అక్రమార్కులతో వారు లాలూచీ పడ్డారేమోనన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

పంచనామా సమర్పించలేదు

కలప నరికివేతపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, అటవీశాఖ అధికారులు పంచనామా సమర్పించలేదు. అందుకే కలప అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై అటవీ అధికారులతో మరోసారి మాట్లాడతాను.

– బి.దేవి, ఎస్ఐ

అక్రమార్కులు నరికిన కలపను కొలుస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్)

వెంటనే చర్యలు తీసుకోవాలి

చామలాపల్లి గ్రామంలో దళితుల భూముల్లోని టేకు కలపను అక్రమంగా నరికిన వారి వివరాలు తెలిసినప్పటికీ అటవీశాఖ, పోలీస్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వారి తీరు మారకుంటే ఈ రెండు శాఖలపై ప్రజలకు నమ్మకం పోతుంది. అటవీ శాఖ వెంటనే పంచనామా నిర్వహించి పోలీస్ శాఖ అనుమతితో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తాం.

– చల్లా జగన్, సిపిఎం జిల్లా నాయకులు

లేబర్ కోడ్లు రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద కార్మికులతో కలిపి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల స్థానంలో కార్మికులను బానిసలుగా మార్చేలా నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చారని తెలిపారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెలికాని ముత్యాలు, కార్మికులు గంగాధర్, ప్రవీణ్, సోములు, దాసు, జగ్గారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట, డెంకాడలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

డెంకాడ : కార్మికవర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశ్యమని వీటిని తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు ఈ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ కోడ్‌లతో కట్టుబానిసులుగా పనిచేయించి దోపిడీని తీవ్రతరం చేయబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఆదిలక్ష్మి, రామయ్యమ్మ, నాగరాజు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో చెరువులకు మహర్దశ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చెరువులు అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. రెండు రోజుల క్రితం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో అమృత పథకం ద్వారా చెరువులు, నీటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. విజయనగరంలోని పెద్దచెరువు, బుచ్చెన్నకోనేరు, నీలాటి చెరువు, అయ్యకోనేరు, కోమటి చెరువు అభివృద్ధి సుందరీకరణకు నిధులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. రోజు రోజుకూ పూడికలు పేరుకుపోయి చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుండటంతో చెరువులో షిల్ట్ తీసి లోతు పెంచి, నీటి సామర్థ్యం పెంచేందుకు, సుందరీకరణ కోసం అమృత పథకం 2.0 పథకం అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ట్రెంచ్ 1 ద్వారా నిధులు కేటాయించారు. విజయనగరం పెద్ద చెరువు లో షిల్ట్ తీసి, చెరువులో వాటర్ ట్యాంక్ పెంచి నీటిని శుభ్రం చేయడంతో పాటు

● 5 చెరువుల అభివృద్ధికి రూ.9.55 కోట్లు మంజూరు
● పెద్ద చెరువుకే రూ.6.15 కోట్లు
● అమృత పథకం 2.0 ద్వారా నిధుల కేటాయింపు

సుందరీకరణకు రూ.6.15 కోట్లు, నీలాటి చెరువు అభివృద్ధికి రూ.80 లక్షలు, బుచ్చెన్నకొనేరు వాటర్ బాడీ అభివృద్ధి కోసం రూ.75 లక్షలు, అయ్య కోనేరు అభివృద్ధికి రూ.90 లక్షలు, కోమటి చెరువు అభివృద్ధికి రూ.కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి. వీటితో చెరువుల అభివృద్ధితో పాటు పరిశుభ్రమైన నీరు ఉండేందుకు, దోమలు నివారణకు ఎంతగానో తోడ్పడుతుంది. మరోవైపు వేసవి నేపథ్యంలో చెరువులను శుద్ధి చేసి, నీటి నిల్వ సామర్థ్యం పెంచడం ద్వారా చల్లని వాతావరణం

నగరంలోని పెద్ద చెరువు

కూడా ఏర్పడేందుకు అవకాశం ఉంది. నగర వాసులు సాయంత్రం వేళ చెరువులు వద్ద సేద తీరేందుకు కూడా తోడ్పడుతుంది. ఇప్పటికే ఈ చెరువులు సుందరీకరణ పూర్తి చేసుకొని ప్రజలకు వినియోగంలోకి వచ్చాయి.

త్వరలో టెండర్లు

ఇటీవల జరిగిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో విజయనగరంలో ఐదు చెరువులు అభివృద్ధికి అమృత పథకం 2.0 ద్వారా నిధులు కేటాయించారు. త్వరలో టెండర్లు పిలవనున్నాం.ఈ నిధులతో చెరువులు అన్ని విధాలా అభివృద్ధి అవుతాయి.

టి.రాయల్ బాబు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ

బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

ఎఎంసి గోదాముల్లో తనిఖీలు

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని బోడసింగిపేట వద్దనున్న ఎఎంసి గోదాముల్లో జెసి సేతు మాధవన్, సివిల్ సప్లై డిఎం మీనాకుమారి గురువారం తనిఖీలు చేపట్టారు. అనంతరం శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో, బొండపల్లిలోని 17వ నంబర్ రేషన్ డిపోలో తనిఖీలు చేశారు. రేషన్ డిపోలకు బియ్యం సరఫరా చేసే వాహనాలను పరిశీలించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం తక్కువగా రావడంతో ఇంకా పలువురికి అందలేదని రేషన్ లబ్ధిదారులు.. జెసి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరరావు, సిఎస్ డిటి తిరుపతిరావు, డీలర్ కె.సత్యనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ, రాష్ట్ర స్థితిగతులను మార్చేలా స్వర్ణాంధ్ర-2047 విజన్ షాన్ కోసం సిద్ధం చేసిన పది సూత్రాల ప్రణాళికను అధికారులంతా చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, గ్యాస్ ప్లాంట్లు, ఎంఎస్ఎంఇ సర్వే తదితర అంశాలపై సమీక్షించారు. సున్నా పేదరికం కోసం పి4 విధానంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సిఎస్ ఆదేశించారు. దీనికోసం అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఉగాది రోజు ప్రారంభిస్తారని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేసి వీటిని రూపొందించాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తామన్నారు. వీరికి సహాయంగా ఐదుగురు సిబ్బందిని కూడా సమకూరుస్తామని చెప్పారు. ఎంఎస్ఎంఇ సర్వేను మార్చి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రస్థాయిలో పలువురు ఉన్నతాధికారులతోపాటు, జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సిపిఒ పి.బాలాజీ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డిపిఒ టి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్‌చక్రవర్తి

మాట్లాడుతున్న జిల్లా జడ్జి చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. గురువారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు మరియు ఎగ్జిక్యూషన్ పిటిషన్ ,ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు ,వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు మరియు ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.మీనా దేవి, బి.అప్పల స్వామి, టివి రాజేష్ కుమార్, దేవీ రత్నకుమారి, బి.రమ్య, ఎక్సైజ్ న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి, పి.బుజ్జి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యం నాయుడు

పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి – నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిఇఒ యు.మాణిక్యం నాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆయన ఉదయం 8.20 గంటలకు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి పిల్లలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. సమయానికి సగం మంది విద్యార్థులు మాత్రమే హాజరవడాన్ని గుర్తించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లలందరూ సమయానికి హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో సుమారు అరగంట మాట్లాడి మార్కులు తెలుసుకుంటూ, పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి వారికి అమూల్యమైన సలహాలు సూచనలు అందజేశారు. కాగా ఉపాధ్యాయులు పాఠశాలకు కనీసం 15 నిమిషాల ముందు హాజరు కావాలని ఆదేశించారు.

పన్ను చెల్లించని షాపులకు తాళాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాలంగా అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను గురువారం రెవెన్యూ విభాగం అధికారులు తాళాలు వేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో చాలా కాలంగా అద్దె బకాయిలు ఉన్నవాటికి రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికి చెల్లించకపోవడంతో దుకాణాలను మూసివేసి తాళాలు వేశారు. మొత్తం 15 దుకాణాలను మూసివేసినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా సకాలంలో అద్దెలు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుములతో అద్దెలు వసూలు చేస్తామని తెలిపారు.

రేషన్‌లో కోత విధించడం తగదు

ప్రజాశక్తి – వంగర

ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో ఉన్న చౌక ధరల రేషన్ షాపు డీలర్లకు ఇచ్చే రేషన్‌లో కోత విధించడం తగదని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లకు ఈ నెల ఇచ్చే రేషన్‌లో కొంత కోత విధించినట్లు తమ దృష్టికి వచ్చిందని, దాని వల్ల లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో రేషన్ అందే అవకాశం ఉండదని ఈ విషయంపై జిల్లా అధికారులు జోక్యం చేసుకొని డీలర్లకు ఇచ్చే రేషన్‌లో కోత లేకుండా అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకి సంబంధించి ఒకే ఒక్క సివిల్ సప్లై డిటి ఉండటం వల్ల ఇబ్బంది జరుగుతుందన్నారు. పేద ప్రజలకు ఇచ్చే రేషన్ సరుకుల్లో కోత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

సెంచూరియన్‌లో హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్

ప్రజాశక్తి – నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బయోవియా డిస్కవరీ స్టూడియో ఆధారిత హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ అండ్ బయోసైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా రిసోర్స్‌పర్సన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భీష్మనారాయణ రథ్ పాల్గొని డ్రగ్ డిస్కవరీ, లైగాండ్-టార్గెట్ ఇంటరాక్షన్, డాకింగ్ ప్రక్రియను ప్రాక్టికల్ డెమోతో ప్రదర్శించారు. విభాగాధిపతి డాక్టర్ పోలాకి సుమన్ దీన్ని ప్రారంభించారు. డీన్ డాక్టర్ సన్నీ డియాల్ డ్రగ్ డిస్కవరీ, బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటేషనల్ బయోలాజీ రంగాలలో ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. డాక్టర్ నాగజ్యోగయ్య, డాక్టర్ కోస్తవ, గౌరీ శంకర్‌తో పాటు బిటెక్, బి.ఫార్మసీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో ముంజేరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి – భోగాపురం

మండలంలోని ముంజేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల విజయనగరంలో జరిగిన బాలోత్సవాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రమణమూర్తి తెలిపారు. కథా రచనలలో పి.చరణ్‌కు తృతీయ బహుమతి, మట్టి బొమ్మల తయారీలో సిహెచ్ అంజలికి ద్వితీయ బహుమతి, ఏకపాత్ర అభినయనంలో బి.దుర్గారావుకు ద్వితీయ బహుమతి, ఫ్యాన్సీ డ్రెస్ సోలో బి.గాయత్రికి తృతీయ బహుమతి వచ్చిందని అన్నారు. గైడ్ టీచర్లుగా ఆర్ సూర్యప్రకాశరావు, డి శ్యామ్ వ్యవహరించారని తెలిపారు.

రైతులకు భూ ఆధార్ : ఎడి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

భూమి ఉన్న ప్రతి రైతుకూ భూ ఆధార్ నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రాల్లో భూఆధార్ నమోదును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకూ గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాళ్లకు మాత్రమే భవిష్యత్తులో పిఎం కిసాన్ లాంటి పథకాలు వర్తింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ప్రతి రైతూ రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ఉపాధి పనులు పరిశీలన

మెరకముడిదాం : మండలంలోని గరుగుబిల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ జి.భాస్కరరావు గురువారం పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు పేదలకు జీవనోపాధికి దోహదపడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించి గిట్టుబాటు ధర వచ్చేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయిలో ఘనంగా జాతర

వేపాడ : మండలంలోని సింగరాయి గ్రామంలో చంద్రమ్మ జాతర వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో జనం పాల్గొని చంద్రమ్మ పేరంటాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటికను ఏర్పాటుచేశారు.

పాఠశాలల సందర్శన

వేపాడ : మండలంలోని సింగరాయి, జగ్గయ్యపేట పాఠశాలలను ఎంఇఒలు నాగభూషణరావు, బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

తెర్లాం : ండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎపిఒ కె.సుశీల తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎపిఒ పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని కూలీలకు సూచించారు. ఎండాకాలం మొదలైన నేపథ్యంలో టెంట్లు, నీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. 2832 మందితో పనిచేయిస్తున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో జాకేరు విద్యుత్తు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ ఇఇ జి.రమేష్‌బాబు తెలిపారు. గుడివాడ, సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, కొత్త సింగరాయి, పాత సింగరాయి, ఆకుల సీతంపేట, ఆతవ, కసిరెడ్డి పాలెం, ఆర్‌ఎస్‌పేట, పికెఆర్ పురం, వీరనారాయణం, ఎస్‌కెఎస్ పురం, కెజిపూడి గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

బెల్ట్ షాపుపై దాడి

బొబ్బిలి : మండలంలోని కారాడలో బెల్ట్ షాపుపై దాడి చేసి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్ననాయుడు తెలిపారు. కారాడలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడి చేసి 14మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్లారమ్మ జాతరపై వివాదం

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన నూతన కమిటీ ఏర్పాటు
- నిర్వహణ బాధ్యత తమదేనంటున్న వైసిపి
- అధికారులే నిర్వహించాలంటున్న టిడిపి

ప్రజాశక్తి – జామి

జామి ఎల్లారమ్మ జాతర నిర్వహణపై వివాదం నెలకొంది. ప్రభుత్వం మారినా, ఎన్నికల కోడ్ కారణంగా నూతన కమిటీ ఏర్పాటు చేయకపోవడంతో పాత కమిటీ ఉంది కనుక... తామే పండగ చేస్తామని వైసిపి నాయకులు వాదిస్తున్నారు. కాదు, ప్రభుత్వం మారడంతోనే పాత కమిటీలన్నీ రద్దు అయ్యాయని టిడిపి నాయకులు సెలవిస్తున్నారు. సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఆ నాయకులు ఉత్సవ కమిటీ నియామకం పేరుతో పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈసారి గత ఆనవాయితీకి ఎన్నికల కోడ్ రూపంలో అడ్డుతగిలింది. దీంతో ముందుగా వైసిపి నాయకులు తగుదనమ్మా... అంటూ పండగ ముహూర్త కార్యక్రమం పెట్టి, తామే పండగ చేస్తామని ప్రకటించేశారు. టిడిపి నాయకుల్లో ఒక గ్రూపు వైసిపితో లాలూచీ పడగా, మరో గ్రూపు మాత్రం పండగను అధికారులే నిర్వహించాలంది. కాదు, కూడదు అంటే... కోర్టుకు వెళతామని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా, అధికారంలో ఉన్న స్థానిక మంత్రి, ఎమ్మెల్యే ఏం చేస్తున్నారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి ఎల్లారమ్మ జాతరకు ఘన చరిత్ర ఉంది. ప్రభుత్వ పండగగా గుర్తింపు లేనప్పటికీ, సుమారుగా మూడు లక్షల జనం తరలివచ్చే జాతర బాధ్యత ప్రభుత్వానిదే. ఈ నేపథ్యంలోనే ఏటా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోనే పండగ నిర్వహిస్తారు. మూడు రోజుల జాతరలో వినోద కార్యక్రమాలు, నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసినా, వాటికి కూడా దేవాదాయ అధికారులు హుండీ ఆదాయంలో చెల్లించిన సందర్భాలు బహిరంగ రహస్యమే. అయితే జనం, ప్రయివేటు వ్యాపారులు, వ్యక్తుల నుంచి చందాలు వసూలు చేయడం ఉత్సవ కమిటీ పనిగా పెట్టుకుంటుంది. ఇందులో భారీ అవినీతికి పాల్పడుతున్నట్లు గతంలో రాజకీయ ప్రత్యార్థులు ఫిర్యాదులు కూడా చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఈ పండగ నిర్వహణపై వివాదం నెలకొంది. ప్రతిసారీ శివరాత్రి వెళ్లి తొమ్మిదో రోజు వచ్చే అష్టమి నాడు జాతర జరుగుతుంది. ఈ లెక్కన మార్చి 6, 7, 8 తేదీల్లో పండగ నిర్వహించాలి. కానీ అమ్మవారి గద్దె ఇంటి నుంచి రావడం, ఆలయ ప్రవేశం వంటి సందర్భాలను మాత్రం పురోహితుడు ముహూర్తం పెట్టి నిర్ణయిస్తారు. ఇది గ్రామపెద్దలు సమక్షంలో జరుగుతుంది. కానీ ఈసారి ఎప్పుడూ లేని విధంగా నిర్వహణపై వివాదం నెలకొంది. దీనిపై ఇఒ ప్రసాదరావును ప్రజాశక్తి వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పండగ నిర్వహిస్తామని, త్వరలోనే స్పష్టత వస్తుందని చెప్పారు.

బాలోత్సవంలో గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 4,5 తేదీల్లో ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగిన విజయనగర బాలోత్సవాల్లో గురజాడ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యధిక బహుమతులు సాధించారు. ఉన్నతాటికలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ బహుమతి, జానపదంలో జూనియర్స్ విభాగం లో ప్రథమ బహుమతి, క్విజ్‌లో ప్రథమ బహుమతి, ఏకపాత్రాభినయం జూనియర్స్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. వక్తృత్వ పోటీ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి, వ్యాసరచన పోటీల్లో తృతీయ బహుమతి పొందారు. మొత్తం ఈ పోటీలకు 24 పాఠశాలలో నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో గురజాడ పాఠశాల నుంచి 8 విభాగాల్లో 42 మంది విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం వి ఆర్ కృష్ణాజి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్ అభినందించారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని రామలింగాపురంలో గురువారం 150 మందికి టిబి యూనిట్ సిబ్బంది క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నెక్కల గౌరినాయుడు కోరారు. కార్యక్రమంలో జిల్లా టిబి కోఆర్డినేటర్ నాగరాజు, ల్యాబ్ సూపర్‌వైజర్ బలరాం, పంచాయతీ సెక్రటరీ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పి గీతిక, ఎఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు జ్యోతి, రాములమ్మ, అప్పన్నమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి జమదగ్ని

పూత దశ నుంచే జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లా ఉద్యాన శాఖాధికారి జమదగ్ని

ప్రజాశక్తి-బాడంగి

మామిడిలో మంచి దిగుబడులు పొందాలంటే పూత దశ నుంచే జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి జమదగ్ని తెలిపారు. గురువారం మండలంలోని ఆకులకట్ట గ్రామంలో బొబ్బిలి హెచ్ఒ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు హాజరై సూచనలు చేశారు. ఈ సందర్భంగా జమదగ్ని మాట్లాడుతూ ప్రతికూల వాతావరణంతో పాటు చీడపీడల దాడులతో మూడేళ్లుగా మామిడి రైతులు నష్టాలు చవి చూస్తున్నారని తెలిపారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడులను సాధించాలంటే పూత దశ నుంచే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుందన్నారు. మామిడి పంటలో పూతదశే కీలకమని, పూతను రక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని చెప్పారు. పూత నుంచి కాయ దశలో చీడపీడలు అధికంగా ఆశిస్తుంటాయని తెలిపారు. తేనెమంచు పురుగు, మసిమంగు, బూడిదతెగులు, పక్షికన్ను తెగులు ఆశించి తీవ్రనష్టం చేస్తుంటాయని చెప్పారు. వీటిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యు.సత్యనారాయణ, విహెచ్‌ఎలు అనూష, భారతి, చినతల్లి, కిశోర్, రైతులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, జెడ్‌పిటిసి రాజేశ్వరి

రైల్వే మూడోలైను పనులు అడ్డగింత

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని మానాపురం వద్ద రైల్వే మూడో పనులను చేపట్టేందుకు గురువారం వచ్చిన అధికారులను సిపిఎం ఆధ్వర్యాన గ్రామస్తులు అడ్డుకున్నారు. మూడో లైను పనుల వల్ల 32 కుటుంబాలు నష్టపోతున్నాయి. వారిని బలవంతంగా ఖాళీ చేయించేందుకు గురువారం ఆ గ్రామానికి అధికారులు పొక్లెయిన్లతో చేరుకున్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యాన గ్రామస్తులు వారిని అడ్డుకున్నారు. 32 కుటుంబాలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ లక్ష్మణరావు అక్కడికి చేరుకొని నాయకులతో చర్చించారు. అయినప్పటికీ ఇళ్ల స్థలాలు ఇచ్చిన తరువాతే పనులు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. అప్పటివరకూ పనులు ప్రారంభిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు రౌతు రాజేశ్వరి, సర్పంచ్ గొటివాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన గిరిజన విజ్ఞానం చాలా గొప్పది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజనుల ప్రాచీన విజ్ఞానం చాలా గొప్పదని గిరిజన విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టమణి అన్నారు. గిరిజనులకు తెలిసిన విజ్ఞానం ప్రకృతి ప్రసాదించిన దని, దాని ద్వారా గ్రహాల గతులు, ఋతువులు, పంటలకు సంబంధించిన పరిజ్ఞానం, వివిధ వ్యాధులను గుర్తించడం దానికి పసరుల ద్వారా వైద్యం చేయడం తదితరమైన అంశాల పై ఇప్పుడు ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. సిటియులో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. భారతీయ విజ్ఞానంపై చాలా పరిశోధనలు చేసి ప్రస్తుత పరిస్థితికి ఉపయోగపడే ఆవిష్కరణలు కావాలని అన్నారు. ముఖ్యఅతిదిగా విచ్చేసిన కేరళకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత ప్రముఖ వైద్యురాలు లక్ష్మీ కుట్టి మాట్లాడుతూ అడవిలో దొరికే చెట్ల వేళ్ళు, బెరడు, కొమ్మలు, ఆకులు, కాండం, పువ్వులు, కాయలు, కొన్ని విధాలైన మట్టి, ప్రత్యేకమైన రాళ్ళు, నీరు తదితరమైన వన్నీ వైద్యానికి పనికి వస్తాయని తెలిపారు. రోగాన్ని బట్టి, అవసరాన్ని బట్టి వ్యక్తి శరీర ధర్మాన్ని బట్టి వైద్యం చేస్తారని తెలిపారు. తాను ఏవిధమైన పాము కాటుకైనా పసరు మందుతో వైద్యం చేస్తానని, ధీర్ఘ కల చర్మ వ్యాదులు కూడా కొన్ని మందులతో తగ్గుముఖం పడతాయని తెలిపారు. సదస్సులో కన్వీనర్‌గా డాక్టర్ నగేష్ కో కన్వీనర్లుగా డాక్టర్ దివ్య ప్రమా చటర్జీ, దేబస్మన నాగ్, డా. బాలుమురి వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాలిథిన్, ప్లాస్టిక్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని కుమ్మరవీధి సచివాలయ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. మస్తరు కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులతో సమావేశమై, షాపుల్లో ప్లాస్టిక్, పాలిథిన్ అమ్మకాలపై దాడులు చేపట్టాలని సూచించారు.

నేడు పలు ప్రాంతాలకు కరెంట్ కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/నెల్లిమర్ల

జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు నగరంలోని పలు వార్డులకు శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. బాబా మెట్ట సబ్ స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలను తొలగించడం, ఇతర సాంకేతిక సమస్యలను సరిచేయడం వల్ల డబుల్ కాలనీ, దర్గా ఏరియా, కేంద్రీయ విద్యాలయం ఏరియా, ఏడు కోవెళ్ళు, బాబా మెట్ట, మిడిల్ పిచ్ ఏరియా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. శుక్రవారం ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు నల్లచెరువు సబ్ స్టేషన్ పరిధిలో బొండుల గూడెం, రింగ్ రోడ్డు రైతుబజార్ ఏరియా, గాంధీ పార్క్ ఏరియా, బాబామెట్ట గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ ఏరియా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కొండ వెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టుకొమ్మలు తొలగించ నున్నందున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా కొండ వెలగాడ, చంద్రం పేట టెక్కలి, ఎల్ ఎన్ పురం, తుమ్మలపేట ,పేద బూరాడపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

అయ్యన్న పేట సబ్ స్టేషన్ పరిధిలో...

అయ్యన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రామవరం, కరకవలస, గ్రామాలకు, కొండతామరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి తాటిపూడి రూరల్ ఫీడర్ పరిధిలో ఉన్న కొత్తవెలగాడ, మదనాపురం, తాటిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే కేసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సిఐ పి.చిన్ననాయుడు హెచ్చరించారు. పట్టణంలో ఉన్న వైన్ షాపులను గురువారం తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. బెల్ట్ షాపులకు మద్యం ఇవ్వవద్దని సూచించారు. బెల్ట్ షాపులకు మద్యం ఇస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పి ధరలు పెంచి అమ్మినా, బెల్ట్ షాపులు నిర్వహించినా తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

రైతులు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

ఈ పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు సూచించారు. గురువారం ఆయన సీతారాముని పేట, సతివాడ రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ పంట నమోదులో భాగంగా వరి పంట నమోదు, జియో ఫెన్సింగ్ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2,575 ఎకరాలలో ఇపంట నమోదు చేశామన్నారు. రబీ ఇపంట నమోదు చేసిన ప్రతీ రైతు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అనంతరం చోడి, మొక్కజొన్న, వరి పంటలలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ పరిశీలనలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి ఎం.పూర్ణిమ, వ్యవసాయ విస్తరణ అధికారులు నాగరాజు, శ్యామ్ కుమార్, గ్రామ పట్టు పరిశ్రమ సహాయకులు ఆర్ లలిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్‌లో ఎస్ఐఎల్‌డి, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వికలాంగులకు బుధ, గురువారాల్లో కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. కృత్రిమ పరికరాలు, మోటార్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, చెవిటి మెషిన్లు, మణుయల్ ట్రై సైకిళ్లు, హ్యాండ్ క్రచెస్, వాకర్స్, తదితర గుర్తింపు కార్యక్రమం నిర్వహించి, అర్హులైన వారికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో ప్రసవాలు జరగాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పిహెచ్‌సిల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారులకు డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి సూచించారు. గురువారం వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ మాతృ సేవలు, వ్యాధినిరోధిక టీకాలు, ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, నీటి ద్వారా సంక్రమించు వ్యాధులు, మలేరియా, డెంగీ, మాతృ శిశు మరణాలపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న వంద రోజుల క్షయ , లెప్రసి సర్వే, ఫైలేరియా సర్వేను జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిడ్స్,

కుష్ఠు నివారణాధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా టీకా అధికారి డాక్టర్ ఆర్.అచ్యుత కుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.సూర్య నారాయణ, మలేరియా నివారాణిధికారి వై.మణి పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి-వేపాడ

ప్రణాళిక ప్రకారం చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ రూపవతి తెలిపారు. బక్కునాయుడుపేట వద్దనున్న గురుకులాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో మాట్లాడి, నూరు శాతం ఫలితాలు సాధించి, గురుకులానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. అటల్ థింకరింగ్ ల్యాబ్, లైబ్రరీని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.ఉషారాణి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రూపవతి

నగరాభివృద్ధిలో ప్రణాళిక విభాగం ప్రధాన పాత్ర

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధిలో పట్టణ ప్రణాళిక అధికారులది ప్రధాన పాత్ర అని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. గురువారం తమ కార్యాలయంలో ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో పట్టణ ప్రణాళిక విభాగం ప్రముఖ భూమిక పోషించి నగరపాలక సంస్థకు మంచిపేరు తేవాలని కోరారు. అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ ఎసిపి రమణమూర్తి మాట్లాడుతూ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారుల సమస్యలు పరిష్కారం, అర్హులైన సిబ్బందికి ప్రమోషన్ కల్పించడంలో కృషి చేస్తున్న టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరావు , సహకారం అందిస్తున్న డైరెక్టర్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఎసిపి హ